


# కొడిగట్టి వెలిగిన జ్యోతి



దేవన్నగారి శ్యామసుందర్

మనిషిగా జన్మించడమే ఒక గొప్ప వరం. ఆ జన్మసాఫల్యంకోసం, ఉత్తమత్వంకోసం తపించడం, అందు కొరకు కృషి చేయడం మనిషి కర్తవ్యాలు. ఇందుకు ఆదర్శాలు అవసరం. కాని ఆదర్శాలు గాలిలో మేడలు కావు. వాస్తవానికి దూరం కాలేవు. అయితే సిద్ధించవు.

వర్షం ఇంకా వెలియలేదు. ఆదేదో తుంపరగా కురుస్తూనే ఉంది. ధరించి బాగా పడదు. పూర్తిగా మానదు. అలా వర్షంలోకి చూస్తూనే విలబడ్డాను. ఎన్నెన్ని జ్ఞాపకాలు మనస్సులో మెదులుతాయి! ఎందరు

వ్యక్తులు స్మృతిపథంలో ఆశారేఖల్లాగా అగుపిస్తారు! ఈ జ్ఞాపకాల పుటల వెనక ఎన్ని మధురానుభూతులు! ఆ జీవితానికి విషాదమనే భావన కించిన్మాత్రంగానైనా ఎరుకలేదు. కాలేజీ రోజుల డైరీలో ఒక పేజీ తిప్పాను. అందులో ఇలా ఉంది:

"ఆ సాన్నిహిత్యం వేరు. ఆ ఆప్యాయత వేరు. ఆ మాట్లాడే తీరులోనే హృదయాహ్లాదకరమైన చల్లదనం ఉంది. చిన్నగా నవ్వినా, చిరుకోపంతో చూచినా ద్యోతకమయ్యే భావం ఒకటే! ఆమెతో మాట్లాడుతూ వింటుంటే వెన్నెల్లో విహరించినంత ఆనందం లభ్యమవుతుంది. ఆమె పేరు సుషమ అవుతే ఎంత బాగుండును!"

ఇది చదివి, కుర్చీ కిటికీ దగ్గిరికి లాక్కున్నాను. డైరీ మూసి, కాలం పుట వెనక్కి తిప్పాను.

• • •

మెరుపుతీవల్లాంటి అమ్మాయిలను చూస్తూ, వాళ్ల రంగు రంగుల చీరల్తో ఇంద్రధనుస్సుల్లాగా మనస్సుకు ద్యోతకమవుతూ, పరీక్షాసంకాని మనస్సుకు ఆ రోజుల్లో ఎప్పుడూ ఆనందమే. కారిడర్స్‌లో వెళుతూంటే ఎన్నెన్ని చిరునవ్వులు పెదవుల మీద హాలోతో మిళితమై మెరిసిపోయేవి! ముఖంలో వ్యక్తావ్యక్తంగా కనిపించేవి, కళ్లలో గంభీరంగా భాసించేవి, ఓరచూపుల వాలకంలో ఒరసుకునిపోయేవి! ఇలా ఎన్ని రకాలు ఆ స్వచ్ఛమైన చిరునవ్వులు! అదంతా ఒక హాసమయ ప్రపంచం. కాలచక్రంలో వెనక్కి పోయిన ఆ జీవితాన్ని తలచుకుంటేనే ఒక పులకరింత.

ఈ తుంపర వర్షంలో బయటకు వెళ్లాలంటే అదొక ఆనందం. ఇది నాలో చిన్నప్పటినుంచీ లేదు. నాకు తడవాలంటే ఎగని చిరాకు. వర్షంలో బజారులో అడుగుపెట్టాలంటే చెప్పలేని అసహ్యం. చిన్నప్పుడు ఆ కిటికీ చువ్వల కానుకుని వర్షంలో బాగా తడిసిన బాదం చెట్టునుండి టపటప రాలే చినుకులను చూస్తూ ఎంత మురిసిపోయేవాడిని! అలా దినమంతా కురిస్తే స్కూలుకు వెళ్లే బాధ తప్పుతుందని ఎంతగా కోరుకునే వాడిని!

కాని, కాలేజీలో చేరిన తరవాత నా దృక్పథమే మారిపోయింది. రెయిన్‌కోటయినా వేసుకొని నానా అవస్థపడి కాలేజీకి చేరేవాడిని. విలాసంగా చీర చెరగులను ఒక పక్కగా పట్టుకుని అతి శ్రద్ధగా నడిచే యువతులను చూస్తూ కాలేజీలోకి ప్రవేశించేవాడిని. ఆఁ ... అన్నట్టు ప్రసన్నాక్షి మొదట ఇలాగే కనిపించింది. అప్పుడు నే నెరుంగను—నా జీవిత స్మృతుల్తో ఇంత గాఢంగా పెనవేసుకుంటుందని!

• • •

వాల్తేరులో అంతర్విశ్వవిద్యాలయం యువజనోత్సవాలు ఘనంగా, వైభవోపేతంగా జరిగిన రోజు లవి. నాకు వక్తృత్వంలో కొంత అభిరుచీ, అభినివేశమూ ఉండేవి. కళాశాలలో చదివినన్నాళ్లూ అంతర కళాశాలల వక్తృత్వపు పోటీ లనేకంగా జరిగాయి. అన్నింటిలోనూ మా కాలేజీ తరఫున ప్రతినిధిని నేను. వివిధ విషయాల మీద విభిన్న దృక్పథాలతో ప్రసంగించటం సరదా అయిపోయిం దలా.

అది మొదటిసారి విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగే వక్తృత్వపు పోటీలో నేను పాల్గొనటం! నాకు భాగస్వామినిగా ప్రసన్నాక్షి ఎన్నిక అయింది. ప్రముఖ విద్యావేత్తలు, ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు ఆనాటి ఉపన్యాసాలు వినటానికి చాలా కుతూహలంగా కూర్చున్నారు. ఒకవైపు వాడిచూపులతో చూస్తూ, ముచ్చటగా కబుర్లు చెప్పుకుంటూ, మధ్య మధ్యలో గలగలా నవ్వుతూ కన్నుల పండువుగా కూర్చున్నారు విద్యార్థినులంతా. మరోవైపు అందమైన అమ్మాయిలను చూసీ చూడనట్టు చూస్తూ, తమ సంభాషణల్లో వారిని గూర్చి మాట్లాడుతూన్నట్టు భావం వ్యక్తమయే చూపుల్ని వారిపై విసురుతూ కూర్చున్నారు విద్యార్థులు.

వేదిక దగ్గిరలో ప్రత్యేక స్థానాల్లో వచ్చి ఆసీను లయ్యారు ఆనాటి న్యాయ నిర్ణేతలు. ఒకరు పత్రికా రంగంలో ఆరితేరినవారు. మరొకరు విశ్వవిద్యాలయంలో ఆచార్యులు. ఇంకొకరు ప్రముఖ న్యాయవాదులు. ఇంత పెద్ద సభలో నేను మాట్లాడాలని తలచుకున్నప్పుడు ఒళ్లు కంపరమెత్తింది. గొంతు గాద్గదికమయింది. అందులోనూ కొత్త ప్రదేశం. భాష, భావం రెండింటిలో ఎక్కడ తప్పటడుగు వేసినా అపహాస్యం పాలయ్యే పరిస్థితి. ఇంతలోనే ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు మొదట మాట్లాడతారని నా పేరు పిలిచాడు అధ్యక్షుడు.

నిదానంగా మైకు దగ్గిరికి వెళ్లాను. మొదటి వక్తనవటంతో కరతాళ ధ్వనులు హాలులో ప్రతిధ్వనించాయి. ఇక నా భయం, ఆదుర్దా భగవంతుడి కెరుక. ఆనాటి చర్చనీయాంశం "వితంతు పునర్వివాహం అవసరమా?" అని. నేను సమర్థిస్తూ మాట్లాడాను. ఇలాంటి సాంఘిక సమస్యలమీద మాట్లాడినప్పుడు భావాల కంతగా ప్రాధాన్యం ఇవ్వరనీ, ఇతర విషయాలు ఎరిగణనలోకి తీసుకుంటారని తరవాత ఒక నిర్ణేత సెలవిచ్చారు.

కందుకూరి వీరేశలింగం రచనలు క్షుణ్ణంగా చదివిన వాడినవటంచేత అందులోని భావాలన్నీ కలిపి మాట్లాడేశాను. నా జీవితానుభవాలతో, ఆలోచనా విధానంతో వాటి కంతగా సంబంధం లేదు. మాట్లాడినంతసేపూ అమ్మాయిలెవ్వరూ కిలకిలమని కరుణించలేదు. అబ్బాయిలెవ్వరూ కాగితపు బాణాలు నాపై రువ్వలేదు. జడ్జీలు తమ తమ స్థానాల్లో కదలకుండా విన్నారు. ఇన్నీ చూసిన తరవాత నేను బాగానే ఉపన్యసించానని అనుకున్నాను. కాని, ఎందుకో నాకు సంతృప్తి లేదు. భావాలన్నీ అంతరంగంలో మండి కాక, అంచులనుండి ఊవలికి పొంగి పొరలినట్టు తోచింది. మధుర మధురమైన అనుభూతులకు తడుముకునే వాడికి, లలిత లలితంగా కవిత్వం వ్రాయాలనుకొనేవాడికి, ఏవో ఊహాలోకాల్లో అస్తమానం విహరించేవాడికి అంతకన్నా ప్రత్యక్షానుభవం జీవితంలో ఏముంటుంది కనక!

నా తరవాత వక్త ప్రసన్నాక్షి. ఆమె మాట్లాడుతూంటే హాలంతా నిశ్శబ్దంగా ఉంది. అందరి దృష్టి ఆమెపై కేంద్రీకృతమయింది. ఆమె ఆలోచనా స్రవంతి వాగ్ధాటితో పోటీపడి వచ్చినట్లున్నది. ఆమె వెలిబుచ్చే భావాలకు అంతఃస్రోతస్వినిగా అనుభవమున్నంత విశ్వాసంతో మాట్లాడుతూంది. అదివరకు ఒకటి రెండుసార్లు విన్నా అంత గాంభీర్యం, హృదయాలలో పరివర్తన తెచ్చే మాటతీరు, మనస్సుల నిట్టే ఆకట్టుకునే వాక్చాతురి — ఇలా ఎన్నో గుణాలు ఏకత్ర పుంజీభవించి, ఒక అయిదు నిమిషాలసేపు మమ్మల నానందపరిచింది.



పాలిక

ఫొటో — భరద్వాజ (మద్రాస్ - 18)

ఆమె చర్చనీయాంశానికి వ్యతిరేకంగా వాదించింది. నేను చెప్పిన ప్రతి అంశాన్నీ ఖండించింది. "ఇవి పుస్తకాల్లో చదువుకున్న భావాలు. వాటి ప్రయోజనం ఎన్నడో తీరిపోయింది. వితంతువుకు పునర్వివాహం అనవసరం. ఆర్థికంగా నిలబడగలిగిన స్త్రీ నేటి సమాజంలో నిలదొక్కుకుని జీవించగలదు. ఎప్పుడూ పురుష జీవితానికి లంకె వేసే ఈ బంధనుల బానిస మనస్తత్వం మీద నాకు కోపం వస్తుంది..." ఇలా సాగిపోయిం దామె ఉపన్యాసం.

ఆమె ఉత్తమ వక్తగా ఎన్నికయింది. మా టీముకు కూడా బహుమతి వచ్చింది.

సాయంత్రం లాన్సులో కూర్చున్నాం. ఎండవేడిమి తగ్గిపోయింది. కొంచెంగా పొడరద్దుకుని, చెవులకు వ్రేళ్లాడుతూన్న రింగులతో అందంగా కనిపిస్తూ, అదేదో పూలమొక్క వైపు చూస్తూ కూర్చుం దామె.

"ప్రైజ్ వచ్చిందనికాదు కానీ, చాలా బాగా మాట్లాడారివాళ" అన్నాను. మ్లానవదనంతో నా దిక్కు చూసింది. "నిజంగా ఇంతవరకు మీ రెప్పుడూ ఇలా ఉపన్యసించలేదు." ఆమె ఇవేమీ విన్పించనట్లే ఉండిపోయింది.

కొంతసేపు మౌనం తరవాత "మీకూ ఇంతేనా అర్థమయింది" అం దామె.

నేను చలించిపోయాను. చిన్నగా నవ్వి అంది: "జీవితమంతా మథనపడి ఆలోచించి తేల్చుకున్న భావాలు నావి."

అదేదో అసహజంగా, కృత్రిమంగా ధ్వనించాయి నా కామె మాటలు. కాని, విశ్వాసదూరంగా మాత్రం లేవు.

"నా కెన్నోసార్లు మీ గత జీవితం మీపై గాఢ ముద్ర వేసిందన్న భావం కలిగింది. కాని, తెలుసుకునే అవకాశం, అడిగేటంత చనువూ లేవు" అన్నాను.

"నా కెందుకో మీ మంచితనం మీద విశ్వాస ముంది. ఈమాత్రం కూడా అందుకే మాట్లాడు తున్నాను" అని మొదలుపెట్టింది.

"ఒక్కగా నొక్క కూతుర్ని కావటం మూలాన మా నాన్నగారు త్వరగా వివాహం చేశారు. కాని, తొలి నాళ్ళ మురిపెం ఆకాశంలో నీలిమలా ఉండిపోయింది. మా ఆయన కొక్క మంచి అలవాటు ఉండేది కాదు. అన్ని వహించి పడి ఉన్నా, ఒక్కనాడైనా మంచిగా పలకరించి ఎరగరు. వైవాహిక జీవితపు కొత్తదనం కొంత, ఈయన దురలవాట్ల దుష్ప్రభావం కొంత. ఇలా నేను సన్నిహితురాలిని కావాలని చేసిన ప్రయత్నం కూడా వృథాఅయింది. సంవత్సరం తిరక్కుండానే మా నాయన దూరమయ్యారు. జీవితంలో సుఖానికి వంచించబడ్డ నేను, మగదిక్కులేని సంసారం చూసి మరీ బేలనయ్యాను.

కాలం కరుణించలేదు. ఆయువ్వీ కూడా తీసుకు పోయింది. ఒకే నావపై పయనిస్తున్న నేను, మా అమ్మ హైదరాబాద్ 'తీరానికి' చేరుకున్నాం.


తన మురిపెం కొద్దీ పెళ్లిచేశాడే తప్ప అకాల మరణాన్ని ఊహించాడా మా నాన్న! విధి వక్రించింది. అలవాట్లకు దాసుడయ్యారుకానీ, కట్టుకున్నదాన్ని దగ్గిర చేసుకోలేక పోయారు, మా ఆయన. ఒక వైపు ప్రేమ, మరోవైపు భాగస్వామినీ కోల్పోయి కకావిక లైన నా బ్రతుకు ఇంత గాంభీర్యాన్ని కొనితెచ్చు కొంది. గంగా యమునల సంగమంలో సరస్వతిగా ఉండ వలసిన ప్రేమ, ఈ మగజాతిపై ద్వేషంగా మారింది. వారి పంచన పడి బ్రతకాలనే ఆశ కూడా నాలో లేదు.

ఇక్కడ నన్ను పునర్వివాహానికి ప్రోత్సహించినవాళ్లంతా నా సౌరభాన్ని ఆస్వాదించ దలిచినవాళ్లే. నా కాళ్లమీద నేను నిలబడితే ఈ సమాజంలో హుందాగా బ్రతక గలననే విశ్వాసం, గుండెదిటవు నా కుంది."

ఇంకోవైపుకు తిప్పుకోబోతూన్న మొహంలోకి చూశాను. అప్పుడే వెలిగిన నియాన్ లైట్ల వెలుగులో ముత్యాల్లా మెరిసే కన్నీటి చుక్కలు ఆమె స్వచ్ఛమైన చెక్కిళ్లమీద మెరిశాయి.

* * *

ఆమె జీవితం కొడిగట్టిన జ్యోతి. కాని, అలాగే ఆరి పోలేదు. మగజాతి ఆ మసక వెలుగులో సుఖంకోసం దేబిరించింది. కాని, జాజ్వల్యమానంగా వెలిగి ఆమె ప్రసా దించిన జీవిత శోభ అందరి కన్నులకూ మిరుమిట్లు గొలిపింది. అందుకేనేమో నేను డైరీలో, 'ఆమె పేరు సుషమ అయితే ఎంత బాగుండును' అని వ్రాసు కున్నది. ★



C.GAS.G.9 TL